తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మినరల్ వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ దాడులు



చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: చిత్తూరు ఉమ్మడి జిల్లాలో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఐజి ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులతో కూడిన రెండు బృందాలు శుక్రవారం జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్లపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మినరల్ వాటర్ ప్లాంట్స్ యాజమానులు యూనిట్ నిర్వహణకు తగిన లైసెన్సులు కలిగివుండక పోవడంను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. అలాగే నీటి నాణ్యత, శుభ్రత తదితర అంశాలపై అశ్రద్ధ వహించినట్లు నిర్ధారించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ వున్నట్లు నిర్ధారించిన విజిలెన్స్ అధికారులు మూడు మినరల్ వాటర్ ప్లాంట్లను సీజ్ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురం గ్రామంలోని ఆక్వా ఫ్రెష్ మినరల్ వాటర్ ప్లాంట్ యూనిట్, కెవిబిపురంలోని ఆక్వాలైట్ మినరల్ వాటర్ ప్లాంట్ యూనిట్, గుడిపాల మండలం పానాటూరు గ్రామంలోని ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్ అండ్ ఆర్‌ఓ ప్లాంట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్లపై దాడులను నిరంతరంగా జరుగుతాయని, నియమ నిబంధనలు అతిక్రమించి ప్రజల ఆరోగ్యంకు హాని కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# బసకూ అభ్యంతరాలు... ఆలయంలోకి అనుమతి లేదా!

**-ఎంత కాలం సాగుతుంది...ఈ అరాచకం పాలన : నారాలోకేష్**



బహిరంగసభలో మాట్లాడుతున్న నారాలోకేష్,సుధీర్‌రెడ్డి, బృందమ్మలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : ఇంత అరాచకమా? శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమా? ఓ ఒక్కరి జాగీరా? అని నారాలోకేష్ శివమెత్తారు. తాను ప్రజా సమస్యలను తెలుసుకోవటానికి పాదయాత్ర చేస్తుంటే ప్రభుత్వానికి ఎందుకు ఉలుకు, దిగులు, భయమూ? అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం నారాలోకేష్ యువగళం పాదయాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రవేశించింది. ఈ నేపథ్యంలో స్థానిక నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రాజీవ్‌నగర్ సమీపంలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాలోకేష్ మాట్లాడుతూ తన పాదయాత్ర అంటే ప్రభుత్వానికి ఎందుకు భయం పట్టుకుందని ప్రశ్నించారు. తాను తన పర్యటన ఈ రోజుకు ఈ రోజు ఫిక్స్ చేసుకున్నది కాదన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుని అడుగులకు మడుగులొత్తుతూ పోలీసులు హంగామా సృష్టిస్తున్నారని అడుగడుగునా తన పాదయాత్రకు అవాంతరం కల్పిస్తున్నారని త్వరలోనే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. యువగళం పాదయాత్ర జగన్మోహన్‌రెడ్డికి జ్వరం తెపిస్తుందన్నారు. తన సౌండ్‌సిస్టమ్ లాక్కున్న పోలీసులకు అవార్డు, స్టూల్ లాక్కుంటె ప్రమోషన్ ఒక్క లోకేష్‌ను అడ్డుకోవటానికి ఇంత మంది పోలీసులు అవసరమా? అని ప్రశ్నించారు. పుణ్యక్షేత్రంలో తాను పర్యటించరాదంటూ ఆంక్షలు విధించడాన్ని ధ్వజమెత్తారు.

**దేవుని దర్శనానికి కూడా ఆంక్షలా?**

ముల్లోకాల్ని ఏలే మహిమాన్వితుడు శ్రీకాళహస్తీశ్వరుడు. ఆయన దర్శనానికి కూడా తనకు ఆంక్షలు విధించటం తగునా? అని ప్రశ్నించారు. తాను,తనసతీమణి ఈ నెల 18వ తేది ఉదయం మహాశివరాత్రి పర్వదినాన స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలంటే ఆలయాధికారులు వీలుకాదంటూ చెప్పటం ఇది దేవాలయమా? లేక రాజకీయ పార్టీ కార్యాలయమా? అని ప్రశ్నించారు. దేవుని దర్శనానికి కూడా ఆంక్షలా? ఇక తాను బస చేసే చోటుకు కూడా ఆంక్షలా? ఇదెక్కడి న్యాయమని లోకేష్ ప్రశ్నల వర్షం కురిపించారు. 420జగన్,ఆయన రూపొందించిన శ్రీకాళహస్తి సైకో తన పాదయాత్రం అంటే 'ఉచ్చ' పోతుందని ధ్వజమెత్తారు.

**శ్రీకాళహస్తిలో అక్రమణల జోరు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంఎల్ఏ అరాచకాలకు హద్దు అపులేకుండా పోతుందని ధ్వజమెత్తారు. రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్ సహాయంతో ఎంఎల్ఏ వెంకటాపురం చెరువును ఆక్రమించుకొని కోట్లు కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. ఎన్నికల నాటి ఎంఎల్ఏ ఆస్తులెంత? నేడు ఆయన సుమారు 2వేల కోట్లకు ఎదిగారు. మరి ఎలా వచ్చింది? ఎక్కడ నుంచి వచ్చిందని నారాలోకేష్ ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి వ్యాపార కేంద్రంగా మార్చారని ముక్కంటీశుడు మౌనంగా ఉండదనుకుంటారేమో? ఆయన మూడో కన్ను తెరిస్తే రోజు దగ్గర్లో ఉందని నారాలోకేష్ శివమెత్తారు. మేము తెచ్చిన కంపెనీల్లో కూడా వ్యాపారాలు పెట్టి దోచుకుంటున్నారని లోకేష్ ధ్వజమెత్తారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, బొజ్జల బృందమ్మ నియోజకవర్గ,మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు, జిల్లా నాయకులు పులివర్తినాని, నరసింహాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యప్రభ వాహనంపై... శ్రీమహావిష్ణువు



చంద్రగిరి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: : శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీమహావిష్ణువు అలంకరణలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశిష్టతను వివరిస్తూ సూర్యప్రభా మధ్యస్థుడై దివ్యకిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ శ్రీ మహావిష్ణువు అలంకరణలో భక్తులను ఆరోగ్యవంతులను చేస్తూ సూర్యప్రభ వాహనంపై తిరుమాడవీధులలో విహరిస్తారు. సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత కావడంతో వర్షాలు, వాటి వలన పెరిగే సస్యాలు, పంటలు, ఔషధీపతి అయిన చంద్రుడు సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాయి. ఈ వాహనసేవలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకలజీవుల చైతన్యప్రభ అని, సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే అన్నారు. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు విహరించడం వలన సూర్య నారాయణుడుగా కొలువబడుతున్నట్లు తెలిపారు. సూర్యప్రభవాహనంపై స్వామి వారిని దర్శించు కోవడం ద్వారా ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన, సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరిం టెండెంట్స్ మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్ధసారధి, అర్చకులు నారాయణాచార్యులు పాల్గొన్నారు.

**చంద్రప్రభ వాహనంపై ఆదినారాయణుడు:**

శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో శుక్రవారం రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఆదినారాయణుడు అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశిష్టతను వివరిస్తూ చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఆదినారాయణుడి అవతారంలో దర్శనమిచ్చి తన చల్లని అమృతకిరణాలతో భక్తులను అమృత స్వరూపులను గావిస్తారన్నారు. నక్షత్రాలకు చంద్రుడు అధిపతి కాగా సమస్త విశ్వానికి అధిపతి స్వామి వారన్నారు. చంద్రుడు ఆహ్లాదకారి అని, శ్రీవారు చంద్రమండల మధ్యస్థుడై పరమాహ్లాదికారి అయ్యారని అన్నారు. సర్వకళాసమాహారాత్మకుడైన ఆదినారాయణుడు తన కళల నుండి 16 కళలు చంద్రునిపై ప్రసరింపజేసినందున చంద్రుడు కళానిధి అయినట్లు వివరించారు. చంద్రప్రభ వాహనంలో శ్రీవారిని దర్శించుకోవడం ద్వారా సకలతాపహరణం, పాపహరం కలుగుతాయన్నారు.

**నేడు స్వామివారి రథోత్సవం:**

శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 7.10 గంటల నుండి 8.30 గంటల వరకు స్వామివారు తిరుమాడవీధులలో రథంపై విహరించనున్నట్లు ఆలయ అధికారులు వెళ్ళడించారు.

# పట్టు వస్త్రాలను అందించిన పెద్దిరెడ్డి

(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున శుక్రవారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, కుటుంబసభ్యులు పట్టువస్త్రా లను అందించారు. మంత్రి దంపతులు రాగా వారికి జ్ఞాన ప్రసూనాంబ సదన్ నుంచి ఊరేగింపుగా తెచ్చి గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు, ధర్మకర్తల మండలి, అధికారులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి, మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి, అకర్షరెడ్డిలు పాల్గొన్నారు. తరువాత వారు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయంవద్ద వారికి స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అందిం చారు. ఏర్పాట్లను ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ కృష్ణారెడ్డి ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్, ఆలయ ప్రోటోకాల్ ఇన్‌చార్జి నాగభూషణం యాదవ్, సురేష్‌రెడ్డి, శ్రీహరి, శ్రీనాధ్‌లు పర్యవేక్షించారు.

# శేషవాహనంపై ఆదిదేవుడు-యాళీ వాహనంపై దేవేరి



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి,17 ప్రభాతవార్త : మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి దేవదేవుడు, ముల్లోకాలను ఏలే ముక్కంటీశుడు తన దివ్యతేజస్సును బంగారు శేషవాహనంపై నుంచి దర్శనమిచ్చాడు. అలాగే ముక్కంటీశుని కోసం తపస్సు చేసి జ్ఞానం పొందిన పార్వతీ దేవి జ్ఞాన ప్రసూనాంబగా వెలసారు. దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు భక్తులకు యాళీ వాహనంపై దర్శనమిచ్చారు. ఉభయదాతలు పేట జనార్ధన్‌రావు కుటుంబసభ్యులు ముందు వెళుతుండగా ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్‌బాబు, హరియాదవ్ పర్యవేక్షణలో ఉత్సవం సాగింది. ఉత్సవంలో ఐదోరోజు నాలుగవ తిరుణాళ్ళలో పట్టణంలో స్వామి అమ్మవార్లను శేషవాహనంపై దర్శించుకొనుటకు తండోపతండాలుగా వచ్చారు. ఉత్సవంలో కీలుగుర్రాలు, నెమలి నాట్యాలు, గెరిగే నృత్యాలు, బ్యాండుమేళాలు, లంబాడీల నృత్యాలు, బుట్ట బొమ్మల నాట్యాలతో కనువిందు చేసాయి. కొత్తగా ఏనుగు బొమ్మలు ప్రత్యేక ఆకర్షణీయంగా మారింది. పెంటయ్యబాండుమేళాలు, బెంగుళూరు మేళాలు,ప్రకాశం జిల్లా నుంచి రప్పించిన విచిత్ర వేష ధారణలు, కేరళ పంచవాయిద్యాలతో పట్టణం దద్దరిల్లింది.

# నియోజకవర్గంలో... అన్నీ గోవిందా..గోవింద!

**నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి**

తొట్టంబేడు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ జాతీయప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర కెవిబిపురం మండలం బైరాజుకండ్రిగ వద్ద నుంచి ప్రారంభమైంది. శిబిరంలో మాజీ ఎంపి పనబాకలక్ష్మి, సత్యవేడు మాజీ ఎంఎల్ఏ హేమలత, ఇన్‌ఛార్జి హెలెన్, చక్రాల.ఉష, పలు వురు మహిళలు ఆయన్ను కలసి వచ్చారు. శిబిరం నుంచి సరిగ్గా నారాలోకేష్ ఉదయం 8.43గంటలకు శిబిరం నుంచి బయటకు రాగానే జై తెలుగుదేశం..జై నారాలోకేష్ అన్న నినాదాలు మిన్నంటాయి. ఎన్నడూ లేని విధంగా సుమారు 700మంది పైగానే పోలీసులు రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇక్కడ శిబిరంలో కొంతమంది నారాలోకేషకు వినతపత్రాలు అందించగా స్వీకరించారు. అనంతరం పాదయాత్రలో చకచకా ముందుకు కదిలారు. పాదయాత్ర లక్ష్మీపురం వద్దకు చేరుకోగా గ్రామాల్లో మొత్తం పసుపుమయం అయిఁది. ఓవైపు తెలుగుదేశంపార్టీ జెండాలు, మరోవైపు యువగళం జెండాలతో నిండిపోయింది. తొట్టంబేడు మండలంలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు.కొందరు మహిళలు తమ సమస్యలను విన్నవించుకోగా వారి నుంచి వినతి పత్రాలు తీసుకున్నారు. సభలో వాహనంపై నుంచి నారాలోకేష్ ప్రజలకు అభివాదం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సైకో పోవాలి... సైకిల్ పాలన రావాలి అన్న నినాదాలు చేశారు. జాబులు గోవిందా.. ఫ్యాక్టరీలు గోవిందా.. గుడి, గుడిలో లింగం కూడా గోవిందా.. అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మొత్తం 'ఎం' ట్యాక్సు, అక్కడ జె ట్యాక్సు ప్రజలు నుంచి వసూలు చేస్తున్నారని, ఇప్పటికి తన నాన్న గారు స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, చిన్నాన్న బొజ్జల హరనాధరెడ్డిలు ఇద్దరు మృతి చెంది పదినెలలు అవుతోంది. మానాన్న, చిన్నాన్నలను ప్రజల్లో చూసుకుని బతుకుతున్నానన్నారు.స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఎక్కువ నిధులు కేటాయించారని నాడు వేసిన రోడ్లే తప్ప ఎక్కడా లేవని మండిపడ్డారు. నాడు నిర్మించిన టిడ్కో ఇళ్ళే, బోర్లు, నాడు లోకేష్ అన్న ఇచ్చిన లైట్లే అన్నారు. టిడ్కో ఇండ్లు దుమ్ము కొట్టుకు పోయాయని లైట్లు ఫీజు పోయాయని చివరికి చెరువులు ఆక్రమణలే అన్నారు.సభలో బొజ్జల బృందమ్మ, గాలిచలపతినాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, గాలి మురళీ నాయుడు, మాజీ ఎంపి పనబాకలక్ష్మి, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఏ సత్రవాడ మునిరామయ్య, యువనాయకుడు సత్రవాడ ప్రవీణ్, పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళ మునిరాజ నాయుడు, వేణురెడ్డిలతోపాటు, పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, కంటారమేష్, చక్రాల.ఉష, చెంచయ్య నాయుడు, రాంబాబునాయుడు, పులివర్తినాని, నరసింహాయాదవ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్ముంటే...ఆస్తులపై సిబిఐ విచారణకు సిద్ధమా?

**-శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ధ్వజం**

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడటం ఆయన తెలివి తనానికి నిదర్శనం అని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఎంజిఎం గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొజ్జల కుటుంబం, నారా కుటుంబంపై ధ్వజమెత్తారు. ఇద్దరి ఆస్తులపై సిబిఐ విచారణకు శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో సంతకాలకు సిద్ధమా? అని ప్రశ్నించారు. తాను నోరు తెరిస్తే బొజ్జల కుటుంబం తలెత్తుకోలేరన్నారు. ఒకసారి మాట్లాడినందుకు నాలుగు రోజులు బృంబందమ్మ హైదరాబాదులో ఏడ్చుకున్నారు. సైకో అంటే అర్థం తెలియని లోకేష్ విమర్శించటం సిగ్గు చేటన్నారు. తాను ఆక్రమణలకు సంబంధించి మాట్లాడారు. అది కోర్టు వివాదాల్లో ఉంది. తెలుసుకో అని మధుసూధనరెడ్డి అన్నారు. రిలయన్స్, టిసిఎల్‌కు రైతులు భూములిస్తే బొజ్జల ఖాతాల్లో వేసుకోలేదా? అని ప్రశ్నించారు. విద్యాసంస్థలకు భూములిచ్చి తమ ఖాతాల్లో వేసుకోలేదా? అని ప్రశ్నించారు. నేను ఎంటాక్సు అయితే మీరు బి టాక్సా అని ప్రశ్నించారు. ఇసుకు గురించి మాట్లాడారు. తెలుగుదేశం హయాంలోనే ఏర్పేడు మండలంలో 17మందిని పొట్టన పెట్టుకున్నారని మధుసూధనరెడ్డి విమర్శించారు. రూ.200ల కూలి మనుషులతో పాదయాత్ర సాగిస్తున్నారు. జనం కావాలంటే నన్ను అడగండి పంపుతానని ఎంఎల్ఏ ఎద్దేవా చేసారు. గుడి గురించి ఒక్కపైసా ఆశించలేదన్నారు. ఇది ఎక్కడైనా ప్రమాణం చేస్తామన్నారు. బొజ్జల హయాంలో వెండిని కరగించి వడ్డానాలు తయారు చేసుకున్నారని ఆరోపించారు. మహాశివరాత్రి రోజు పట్టణంలో పాదయాత్ర అంటారు. ఇది స్థానికుల పండగ అని కూడా తెలియదా? నేను బెంగుళూరులో సంపాదించి ఖర్చు పెడుతున్నాను. అది తెలుసుకోకుండా లోకేష్ మాట్లాడటం ఆయన అమాయకత్వానికి నిదర్శనం అన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు,గుమ్మడి బాల కృష్ణ,లోకేష్ యాదవవ్, ఆర్కాట్ ముత్తు తదితరులు పాల్గొన్నారు.

# 6 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా!

**- రాత్రికి రాత్రే మామిడి చెట్లు నాటడానికి యత్నం- అడ్డుకొని భూమిని స్వాధీనం చేసుకొన్న రెవెన్యూ అధికారులు**

గుడిపాల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: గుడిపాల మండలం 189 కొత్తపల్లి గ్రామ పరిసరాల్లో కబ్జాకు గురైన 6 ఎకరాల ప్రభుత్వ భూమిని తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకొన్నారు. 189 కొత్తపల్లి గ్రామ పరిసరా ల్లో కొంతమంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొంటున్నట్లు రెవెన్యూ అధికారులు సమాచారం అందడంతో తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ రమాసాయి, మండల సర్వేయర్ గణేష్‌ల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు హుటాహుటిన కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి దగ్గరికి వెళ్ళారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలో మామిడి చెట్లు వున్నట్లు తేలడంతో సర్వేయర్ గణేష్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు. గుడిపాల మండలానికి చెందిన పరంధామ భార్య జయలక్ష్మీ, కుప్పయ్య కుమారుడు పరదేశిలు ఈ భూమిని ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. 189 కొత్తపల్లి గ్రామం పరిసరాల్లో బ్లాక్ నెంబర్ 21లో ప్రభుత్వ భూమి విస్తారంగా వుంది. ఈ భూమిలో ఇది వరకే జయలక్ష్మీ, పరదేశిలు కొంత మేరకు ఆక్రమించుకొని అందులో మామిడి చెట్లు పెంచి పోషిస్తున్నారు. వీరు తాత ముత్తాల నుండి ఈ భూమిని ఆక్రమించుకొని పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రక్కనే విస్తారంగా ప్రభుత్వ భూమి వుండటంతో మరికొంత భూమి ఆక్రమించుకొని అందులో మామిడి చెట్లు పెట్టి పోషించాలని నిర్ణయించి గురువారం రాత్రికి రాత్రే భూమిని జెసిబి సహాయంతో చదును చేశారు. శుక్రవారం తెల్లవారుజాము ఈ విషయం స్థానికులు గుర్తించి తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు తహసిల్దారు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన భూమి వద్దకు చేరుకొని అక్కడ భూమిని సాగు చేసుకొం టున్న వారి రికార్డులను అడిగారు. ఎలాంటి రికార్డులు లేదని గుర్తించిన రెవెన్యూ అధికారులు మొత్తం 5.85 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటుందని తహసిల్దారు పేర్కొన్నారు.




# అధికారంలోకి వస్తున్నాం...ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం : గాలి భానుప్రకాశ్

పుత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని నగరి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. ఇటీవల పుత్తూరులో జరిగిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం చేసినందుకు శుక్రవారం పట్టణంలో ఆయన పట్టణ, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, టిడిపి కార్యకర్తల ఆశీస్సులతో నగరిలో గెలిచి అందరికీ



అండగా వుండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని తెలిపారు. పుత్తూరుకు పూర్వ వైభవం తీసుకువస్తానని, యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. చేనేత, మరమగ్గ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా పుత్తూరులో శాంతి, భద్రతల సమస్య లేకుండా గట్టి చర్యలు చేపడతామన్నారు. తన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు పుత్తూరు, నగరి నియోజకవర్గానికి చేసిన సేవలు గుర్తుంచుకునేలా చంద్రన్న పాలనలో తాను చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని గుర్తిస్తున్నానని, తగిన న్యాయం చేసి గౌరవిస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో పార్టీ పట్టణ, రూరల్ విభాగాల అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, రవికుమార్, బిసి సెల్ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సిహెచ్. షణ్ముగరెడ్డి, టిఎన్‌టియుసి అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, నాయకులు బి.ఆర్.యుగంధర్, సిహెచ్.కరుణయాదవ్, బొబ్బిలి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తుకు 1200మంది పోలీసులకు విధులు : ఎస్పి

.శ్రీకాళహస్తి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నేడు నిర్వహించే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకు 1200మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 ప్రముఖ శైవక్షేత్రాల్లో కూడా గట్టిభద్రతా ఏర్పాట్లు చేపట్టామని ప్రత్యేక పోలీస్ కమాండ్ కంట్రోల్ మరియు సిసి కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. పట్టణానికి వచ్చే వాహనాలను నిరంతరం క్షుణ్ణంగా తనిఖీలు చేయడానికి పోలీస్‌చెక్ పోస్టులు ఏర్పాటుచేశామని బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. స్థానికులు కూడా సహకరించాలని ఉత్సవాల్లో అన్నదానం చేసేవారు ఇతర భక్తులకు సేవలందించేవారు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరావు, అడ్మిన్ ఎస్‌పి, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, డిఎస్పీలు సురేంద్రరెడ్డి, నరసప్ప, మురళీకృష్ణ, నాగసుబ్బన్న, కాటమరాజు, సుధాకర్, సిసిఎస్, సిఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా అగస్తీశ్వరస్వామి ధ్వజారోహణం

తొట్టంబేడు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా పెద్దకన్నలి గ్రామంలో వెలసిన దుర్గాంబికా సమేత అగస్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం స్వామివారి ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రాలు చదువుతుండగా ఆలయ అర్చకులు, పురోహితులు ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంభంకు చీరలును అధిరోహించి శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. నేడు మహాశివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లదర్శనంతో పాటు రాత్రి 3గంటలకు లింగోద్భవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## దర్గాను దర్శించుకున్న శివమణి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రముఖ సంగీత విళయ తాండమణి, పద్మశ్రీ శివమణి పట్టణంలోని పానగల్‌లో వెలసిన జుంలేషాపీర్‌దర్గాను దర్శించుకున్నారు. ఆయనకు దర్గానిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన ఈదర్గాను దర్శించుకోవడం ఆనందంగా ఉందని శివమణి తెలిపారు. కార్యక్రమంలో దర్గానిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శివమణి వాయిద్యాల సమ్మేళనం

**శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పద్మశ్రీ విళయ తాండవమణి శివమణిచే నిర్వహించిన వాయిద్యాల సమ్మేళనం భక్తుల్ని ఆకట్టుకుంది. మంత్ర ముగ్దుల్ని చేసింది. ఆయన వాయిద్యాలతో సభికులను ఓల లాడించారు.సుమారు మూడుగంటలకు పైగా వివిధ వాయిద్యాలతో సృష్టించిన సంతోషం వర్ణించనలవి కాదు.ముఖ్యంగా డ్రమ్స్‌తో ఆయన సంగీత ప్రియులను మైకంలో ముంచెత్తినట్లు మాయ చేసారు. ఆయన మొదట స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు కూడా దేవస్థానం బస సదుపాయం కల్పించలేకపోయారు. కనీసం వారికి తగిన గుర్తింపు ఇవ్వలేదు.ఆయన శివునిపై రూపొందించిన పాటలను వాయిద్యాలతో వినిపించారు.కాగా శ్రీకాళ హస్తికి చెందిన కళాకారులు లేఖ్యచందన, కొండా శ్రావణినృత్య ప్రదర్శనలు పిళ్ళారి బత్తినయ్య భక్తి రంజని ఆకట్టుకుంది.కరీంనగర్‌కు చెందిన ఆదివాసి నృత్యనికేతన్ రత్నకుమార్ ప్రదర్శించిన పేరణి శివతాండవం, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయితే దూరప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు శివమణితో సహా దేవస్థానం కనీసం బస సదుపాయం కల్పించటంలో విఫలమయ్యారు. కొత్త వారికి బాధ్యతలు అప్పగించటంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

## బాలికల విద్యతోనే అభివృద్ధి సాధ్యం



**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** బాలికల విద్యతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని తొండమనాడు సర్పంచ్ బర్రె హేమభూషణ్‌రెడ్డి అన్నారు. తొండమనాడులోని ఎగువవీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా ప్రగతి ట్రస్టు,మై ఛాయిస్ స్వచ్ఛంద సేవ సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ర్యాలి జరిపారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ అజయ్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో ఎగువవీధి సర్పంచ్ హేమభూషణరెడ్డి ప్రగతి ట్రస్టు శ్రీకాళహస్తి డివిజన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, మైఛాయిస్ కోఆర్డినేటర్ దేవేంద్రకుమార్,మహిళాపోలీసు మాధవి,బత్తెమ్మ, మునిభారతి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నంది, కన్నప్పలకు పూజలు చేసిన ఎంఎల్‌ఏ



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా విజయ వాడ వైపు నుంచి వచ్చే వారికి సూచికగా నంది విగ్రహం, అలాగే చెన్నై వైపుల నుంచి వచ్చే వారికి గుర్తింపుగా భక్తకన్నప్ప విగ్రహాలను సుమారు రూ.20లక్షలతో ఏర్పాటు చేసారు.ఈ విగ్రహాలకు శుక్రవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సారథ్యంలో పూజలు జరిపారు.మధుసూధనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు బోర్డు సభ్యులు బుల్లెట్ జయశ్యాం,మహీధర్‌రెడ్డి,పసల సుమతి,కొండూరుసునీత, గుమ్మడబాలకృష్ణయ్య,లోకేష్ యాదవ్, కంఠా ఉదయ్‌కుమార్ పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

## జె.సి.చే సర్వే ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రెవెన్యూ సర్వే ఉద్యోగుల సంఘం 2023 సంవత్సరం డైరీని జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీ ఆవిష్కరించారు. శుక్రవారం జె.సి. ఛాంబర్‌లో సర్వేయర్ల సంఘం ప్రతినిధులు జె.సి.ని కలిసి డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు సంఘం ఏ.డి. జయరాజ్, సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.కరుణాకర్, కార్యదర్శి చరణ్, పురుషోత్తం, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఆస్కరరావు



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆస్కరరావు డిమాండ్ చేసారు. శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశం ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా రాష్ట్ర కార్యదర్శి ఆస్కరరావు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్సనర్ల, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు, డి.ఏ., జి.పి.యఫ్, ఏ.పి.జిఎల్ఐ సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్ తదితర విషయాలను పరిష్కరించాలన్నారు. రిటైర్డ్ భేనిఫిట్స్ వంటి చట్టబద్దమైన ఫైనాన్సియల్ క్లైయిమ్స్ చెల్లింపులకు గడువు షెడ్యూల్ ఉంటుందన్నారు. ప్రభుత్వ నియమనిబంధనలను అవలంభించవల్సిన ఆర్థిక పంపిణి పద్దతుల కింద చెల్లింపులు చేయుటకు ఇటీవల కాలంలో ప్రభుత్వం షెడ్యూల్ టైమ్ లైన్ విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఉద్యోగుల జి.పి.ఎఫ్ ఖాతాల నుండి అనుమతి లేకుండా విత్ డ్రా చేసిన 480 కోట్లను తిరిగి ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టంగా తెలియజేయాలన్నారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు సి.సి.ఎస్. ఉద్యోగుల వాటాకు ప్రభుత్వ వాటా కలిపి మొత్తాన్ని సిపిఎస్ ఖాతాకు 20వ తేదీ లోపు జమ చేయాలని, మార్చి2022 నుండి సిపిఎస్ ఖాతాలకు జమ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు, కార్యదర్శి బాబాసాహెబ్,లక్ష్మీపతి,సత్యనారాయణబాబు,రవిశంకర్,తిరుపతిజిల్లాఅధ్యక్షుడుప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

## రీ సర్వే చేసిన భూముల్లో హద్దు రాళ్ళును ఏర్పాటు చేయాలి

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రీ సర్వే చేసిన భూముల్లో హద్దు రాళ్ళును నాటాలని జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. ఇప్పటికే ఇంటి పట్టాలు అందించిన వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆర్డిఓ, తహాశీల్దార్స్, సర్వేయర్లతో జె.సి., డిఆర్వో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జె.సి. మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించిన సర్వేయర్లు సూచించిన మేరకు మాజరుకావాల్సి ఉంటుందన్నారు. రీ సర్వే పనులు కూడా అనుకున్న సమయానికి పూర్తి చేయాలన్నారు. అసైన్డ్ భూముల జాబితాను సిద్దం చేయాలని, మ్యుటేషన్‌కు సంబంధించి వారసుల ఒకరు ఉన్నచోట తక్షణమే పూర్తి చేయాలన్నారు. రీ సర్వే సమయంలో ఖాతాలో చిన్న తప్పులు కూడా లేకుండా చూడాలన్నారు. నాయుడుపేట జాతీయ రహదారి సంబంధించి భూ సేకరణ త్రీ డి పూర్తి కావాలని సూచించారు.

## 6వ రోజు 18.02.2023 నందిసేవ...ఇంద్ర విమానం-చప్పరవాహనసేవ

మాఘ బహుళ త్రయోదశి శనివారం ఉదయం 10ః30గం.లకు
అభిషేక ఉభయదాతలుః- శ్రీ సి.సత్యనారాయణ, అడ్వకేట్, శ్రీకాళహస్తి
రాత్రిః- 9.30గం.లకు నంది-సింహ వాహనసేవ
ఉభయదాతలు-1.దక్షిణ భారతదేశ దేవాంగ సంఘం వారిచే పట్టు వస్త్రాలు సారె సమర్పణ (శ్రీస్వామి వారికి నందివాహనం, అమ్మ వారికి సింహ వాహనంపై పెట్టిన తర్వాత తొలిపూజ)
2. శ్రీ వెంకటగిరి రాజా వారు, వెంకటగిరి, శ్రీ పొట్టిశ్రీరాములు, నెల్లూరు జిల్లా.
3. కీ.శే. యద్దనపూడి.వెంకటసుబ్రమణ్యశర్మ, శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం
4. శ్రీ కె.దయానంద గుప్త, బజారువీధి, శ్రీకాళహస్తి.
5. శ్రీ టి.యస్.రాముగుప్త, శ్రీమతి సబిత, అరుణ మెడికల్స్ శ్రీకాళహస్తి.
ధూర్జటి కళాప్రాంగణంలో నేడు..
18-02-2023 శనివారం
మహాశివరాత్రి:నందిసేవ-సింహవాహనం
ఉ.8గం.లకు :శ్రీ రవిభాగవతార్, పుత్తూరు వారిచే హరికథ
ఉ.9గం.లకు : వర్ణ మ్యూజిక్ అకాడమీ, ఎ.విజయలక్ష్మి, తిరుపతి వారిచే భక్తిరంజని
ఉ.10గం.లకు: సూపుర కూచిపూడి నృత్యాలయ, కుప్పం యస్‌వి, కల్పనాదేవిచే నృత్య ప్రదర్శన
ఉ.11గం.లకు : శ్రీ కళా నాట్యమండలి, శ్రీకాళహస్తి, శ్రీవిద్య వారిచే నృత్య ప్రదర్శన
మ.12గం.లకు: సి.సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి వారిచే భక్తిరంజని
మ.12.30గం.లకు : యల్.ధనుష్క, పి.ఓధనాసారా, శ్రీకాళహస్తి వారిచే నృత్య ప్రదర్శన
మ.1గం.లకు : లాస్యతరంగిణి నృత్యాలయము, పుత్తూరు వారిచే నృత్య ప్రదర్శన
మ.2గం.లకు:ఆర్.హర్షిత సూర్యకుమార్, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
మ.2.30గం.లకు: కుందనిక, కర్నూలు వారిచే నృత్యప్రదర్శన
మ.3గం.లకు: శ్రీచైతన్య నాట్య కళామండలి, తిరుపతి యం.చైతన్య వారిచే నృత్యప్రదర్శన

## విద్యుత్ కాంతుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం

-నేడు మహాశివరాత్రి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



నేడు మహాశివరాత్రి. భక్తుల కైవల్యానికి దారి. హర..హర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల నామస్మరణలతో ఆలయం మారుమ్రోగుతుంది. దీంతో ఆలయాన్ని విద్యుత్ కాంతులతోదేదీప్యమానంగా అలంకరించారు. బిక్షాలగోపురం, నవయుగరాజగోపురం, రామసేతువంతెన, జలవినాయకుని వద్ద ఉన్న వంతెనతో పాటు నాలుగుమాడవీధుల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఇక బాబుఅగ్రహారం వీధిలో విద్యుత్‌కాంతులు, కుమారస్వామి తిప్ప వద్ద విద్యుత్ దేవుడి వెలుగులు, రామసేతువంతెన వద్ద ఉత్సవాలకు సంబందించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బ్యాడ్జీ ఆకట్టుకుంటోంది. ఇక బసవయ్యపాళెం వద్ద నూతనంగా నిర్మించిన నందిసర్కిల్, చెన్నై-నాయుడుపేట బైపాస్ రోడ్డు వద్ద నిర్మించిన భక్తకన్నప్ప సర్కిల్‌లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఆలయంలో పల,పుష్పాలతో అలంకరణ నూతన శోభను సంతరించుకుంటోంది.

## ఘనంగా 27వ వార్షిక దినోత్సవ వేడుకలు

రేణిగుంట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం కరకంబాడి అమర రాజా విద్యాలయంలో 27వ వార్షిక దినోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎస్‌వీ యూనివర్సిటీ ప్రొఫెసర్, డీన్ కిరణ్ క్రాంతి హాజరయ్యారు. అమర రాజా సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ తన ఉద్యోగస్తుల పిల్లలకు నాణ్యమైన విద్యను డిజిటలైజేషన్ పరంగా అభివృద్ధి చెందే దిశలో అన్ని సదుపాయాలను కల్పించామని చెప్పారు. ముఖ్య అతిథి కిరణ్ క్రాంతి చౌదరి మాట్లాడుతూ విజయం సాధించాలంటే క్రమశిక్షణ చాలా ముఖ్యమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు గల్లా అరుణకుమారి, అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి, రాజన్న ట్రస్టు హెడ్ సతీష్, ప్రధానోపాధ్యాయురాలు గ్లోరిదేవ ప్రియ, ఉప ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష,అశ్వవాహనాలపై కపిలేశ్వరుడు

-నేడు మహాశివరాత్రి వేడుకలు

తిరుపతి,ఫిబ్రవరి 17ప్రభాతవార్త:



తిరుపతి టిటిడి అనుబంధ ఆలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం సోమస్కంధమూర్తి కల్పవృక్షవాహనంపై, రాత్రి అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చాడు. ఉదయం స్వామివారిని సర్వాలంకారభూషితుడ్ని చేసిన అర్చకులు కోరిన కోరికలు తీర్చే కల్పవృక్షాన్ని వాహనంగా చేసి అధిరోహించిన స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు ఓంనమ:శ్శివాయ అంటూ శివనామస్మరణ చేశారు. ఈ వాహనసేవల్లో ఆలయ డిప్యూటీ ఇఒ దేవంద్రబాబు, ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

**-నేడు మహాశివరాత్రి వేడుకలు:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా (నేడు)శనివారం ఆలయంలో ప్రత్యేకంగా క్యూలైన్లు, చలువపందిళ్ళు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున 2.30గంటల నుంచి 4.30గంటల వరకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

## అధికారంలోకి రాగానే టిడ్కో ఇండ్లు అందిస్తాం : నారాలోకేష్

తొట్టంబేడు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :



తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే పూర్తిగా అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇంటినిర్మాణాలను వెంటనే లబ్దిదారులకు అందిస్తామని తెలుగుదేశంపార్టీ జాతీయప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తెలిపారు. పాదయాత్రలో భాగంగా రాజీవ్‌నగర్ వద్ద ఉన్న టిడ్కో ఇండ్లను పరిశీలించి అంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ నిరసనగా తెలుగుదేశంపార్టీ నాయకులు కాసరం రమేష్, సుబ్బయ్య, వజ్రంకిషోర్, ఆర్ముగం, సునీల్, గౌతమ్‌రెడ్డి,కన్నావరంహరిబాబులు అర్ధగుండుతో కొట్టుకుని, అర్ధమీసంలో రాజీవ్‌నగర్ వద్ద నిరసన తెలుపుతున్న వారికి సంఘీభావం తెలిపి టిడ్కో ఇండ్లను పరిశీలించారు. ఎంతో మహోన్నత ఆశయంతో నిరుపేదల సొంత ఇంటికలను నెరవేర్చడానికి మాజీ మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సుమారు 3వేలకు పైగా ఇండ్లు కేటాయించగా ఇప్పటి వరకు లబ్దిదారుల నుంచి డిడిలు తీసుకుని ఇప్పటి వరకు చెల్లించకపోవడం శోచనీయం అన్నారు. ఎంతో చక్కగా చట్టిన ఇండ్లను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమ హయాంలో నిర్మించిన ఇండ్లకు కూడా వైకాపా రంగులు వేసుకుంటోందని విమర్శించారు. ఇక్కడ మహిళలు లోకేష్‌కు హారతులిచ్చారు. కొందరు లోకేష్‌తో సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. అనంతరం పక్కనే ఉన్న పివిఆర్‌గార్డెన్స్ లో బహిరంగసభకు హాజరయ్యారు. కార్యక్రమాల్లో సభలో బొజ్జలబృందమ్మ, రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మాజీ ఎంపి పనబాకలక్ష్మి, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ సత్రవాడ మునిరామయ్య, యువనాయకుడు సత్రవాడ ప్రవీణ్, పాలసరఫరా మాజీ చైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు,తొట్టంబేడు నాయకులు వేణురెడ్డిలతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, కంఠారమేష్, చక్రాల.ఉష, చెంచయ్యనాయుడు, రాంబాబు నాయుడు, పులివర్తినాని, నరసింహయాదవ్, పలువురు తొట్టంబేడు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాకాడు నాయకులతో నేదురుమల్లి సమావేశం

వాకాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :

వైకాపా సీనియర్ మండల నాయకులతో శుక్రవారం నేదురుమల్లి నివాసంలో రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్, వెంకటగిరి అసెంబ్లీ సమన్వయకర్త, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి భేటి అయ్యారు. జిల్లాలోని వైకాపా నాయకులతో కోఆర్డినేట్ చేసుకుంటూ వస్తున్న నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆ క్రమంలోనే స్వంత గ్రామమైన వాకాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలు సాధనగా ప్రతి నాయకుడు కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అదే విధంగా మండలంలోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై నాయకుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని జరగబోవు శివరాత్రి ఉత్సవ కార్యక్రమాల గురించి నాయకులతో చర్చించినట్లు తెలిపారు. ఈ నెల 20న తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి జనార్ధన్ రెడ్డి జయంతి కార్యక్రమం జరుగుతున్నట్లు నాయకులకు ఆయన తెలిపారు. మండలంలోని వివిధ కార్యక్రమాలపై నేదురుమల్లితో నాయకులు వారి వారి అభిప్రాయాలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుని మన సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. అందుకు ప్రతి నాయకుడు ఓటర్లను కలుసుకుని మన అభ్యర్థులను గెలుపొందేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోధర్ రెడ్డి, సీనియర్ నాయకుడుపాపారెడ్డి,మనోజ్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు రౌతు రామకృష్ణ, నేదురుమల్లి బాబు రెడ్డి, మాజీ ఎంపిపి దువ్వూరు మధుసూధన్ రెడ్డి, వాకాడు ఉపసర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, వెంకటరత్నం, చంద్రభూషణ్ రెడ్డి, సుధాకర్ నాయుడు, వాకాడు ఏఎంసి డైరెక్టర్ వాకాటి జనార్ధన్ రెడ్డి, మహేంద్ర, నందగోపాల్ రెడ్డి, కోటేశ్వర రెడ్డి, రామలింగారెడ్డి, మాజీసర్పంచ్‌దువ్వూరుభార్గవ్‌రామ్,కోట,చిట్టమూరు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నా రు.

## నందివాహనంపై ఊరేగిన కాళభైరవుడు

తవణంపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



మండల కేంద్రం తవణంపల్లెలో వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి నందివాహనసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గురువారం నుండి జరుగుతున్న మహాశిరాత్రి ఉత్సవాలల్లో భాగంగా శుక్రవారం నందివాహనసేవను నిర్వహించారు. ఈకార్యక్రమంకు తవణంపల్లెకు చెందిన కీ.శే.పంజాక్షరం శెట్టి కుమారులు, జిల్లా గాండ్లసంఘం రాష్ట్ర కోశాధికారి, టీడీపీ మండల బిసీ సెల్ అధ్యక్షుడు ఏపీ వినాయక, ఏపీ దొరబాబులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులచే స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయం వద్ద స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి నందివాహనంపై వుంచి గ్రామపురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## అర్ధగిరి సన్నిధిలో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

తవణంపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామివారిని జిల్లా ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ వెంకట సుబ్బారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, సంజీవరాయని పుష్కరిణి తీర్థాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, స్థానిక ఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హంస వాహనంపై విహరించిన మొగిలీశ్వరుడు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంస వాహనంపై మొగిలీశ్వరుడు ఊరేగారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలను అర్చకులు నిర్వహించారు. వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ పుర వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఈ ఉత్సవానికి కరణం సంక్షేమ సంఘం ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్,ఇఓమునిరాజులు,పరిసరగ్రామస్తులు, కరణీకర్ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అధికార నంది వాహనంపై ఆది దంపతులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొగిలీశ్వరుడు శుక్రవారం ఉదయం అధికార నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మూల విరాట్ స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు రెడ్డప్ప గురుకుల్, విశ్వనాధ గురుకుల్, దండపాణి గురుకుల్ ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలతో అర్చకులు అలంకరించారు. అనంతరం అధికార నంది వాహనంపై ఉత్సవమూర్తులను వుంచి గ్రామ పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టారు. ఈ ఉత్సవానికి గాండ్లపల్లికి చెందిన సాంబశివ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఇందులో ఆలయవంశపారంపర్యధర్మకర్తఎంబివిజయకుమార్, ఇఓ మునిరాజులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు నంది సేవ

శ్రీకాళహస్తి, ప్రభాతవార్త :



శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాయులింగేశ్వరునికి నంది సేవ నిర్వహించనున్నారు. సాధారణంగా వైష్ణవ క్షేత్రాల్లో గరుడ సేవ, శైవ క్షేత్రాల్లో నంది సేవ ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. దేవతలనుబాధిస్తున్న త్రిపురాశురుడనే రాక్షసుడిని అందరి సహకారంతో ముక్కంటీ శుడు సంహరించిన సందర్భంగా దేవదానవులం దరూ నందిపై ఊరేగింపు జరుపుతారు. అదే శివరాత్రి అంటారు.

**ఆది భిక్షువుకు 11కాలాల్లో అభిషేకం..** శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి పర్వదినాన వాయులింగేశ్వరునికి పదకొండు సమయాల్లో అభిషేకం నిర్వహించటం ప్రత్యేకతగా చెబుతారు. శివరాత్రి సందర్భంగా ఉదయం మూడు గంటలనుంచే దర్శనానికి అనుమతిస్తారు. ఇతర శైవ క్షేత్రాలలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిర్మాణంలోనూ, పూజా కార్యక్రమల్లోను భిన్నత్వం కనపడుతుంది. దేవ, దానవుల సాగరమధనంలో వెలువడిన హాలాహాలాన్ని లోక కళ్యాణార్ధం ముక్కంటీశుడు సేవించినట్లు చెబుతారు. హాలాహాలాన్ని సేవించిన శివుడు కనురెప్పపాటు విశ్రమించారని దాంతో ఆందోళన చెందిన భక్తులు దేవతలు తల్లడిల్లుతుండగా మేల్కొన్నట్లు స్థలపురాణంలో ఉంది. అందుకు పరమేశ్వరుని గరళకంఠుడు, మృత్యుం జయుడని పిలుస్తారు. హాలాహాలాన్ని మింగిన శివుడు మేల్కొన్న సందర్భంగా ఆనందోత్సహాలతో ఉత్సవాలు జరుపుకున్న సందర్భాన్ని శివరాత్రి అంటారు. ఆ రోజు పరమశివుని నంది వాహనంపై అర్ధరాత్రి 12గంటల నుంచి వేకువ జామున మూడు గంటల వరకు దర్శనం చేసుకోవటం మంచిదని పెద్దలు చెబుతారు. అందుకు నిదర్శనంగా వేకువ జామున నుంచి నిత్యకాలాభిషేకాలు నాలుగు, నైమిక్తి అభిషేకాలు నాలుగు, రెండవ రోజు మూడు అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. శివరాత్రి రోజు శివుడు నందివాహనంపై పుర ప్రదర్శనకు వెళ్ళేందుకు పదికాలాల అభిషేకాలు పూర్తి చేస్తారని,స్వామిఅమ్మవార్లు పుర ప్రదర్శన ముగించుకొని రాగానే ఒక అభిషేకం నిర్వహిస్తారని ఈ అభిషేకాన్నిబ్రహ్మఅభిషేకమనిచెబుతారు.ఈఅభిషేకాలనులింగోద్భవఅభిషేకంఅంటారనిఅర్చకుల అభిప్రాయం.

## లింగోద్భవ దర్శనం - ముక్తికి మార్గం

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)



మహాశివరాత్రి అంటే ఎప్పుడూ ఆలయానికి రాని వారు కూడా భక్తితో వచ్చి భోళాశంకరుని దర్శించుకుంటారు. మూగజీవాలకు మోక్షమిచ్చిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో.ఈ దివ్యక్షేత్రంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను 13రోజుల పాటు నిర్వహిస్తారు.అయితే ఈ దివ్యక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో శివరాత్రి పర్వదినాన ఎంతో భక్తి శ్రద్ధలతో నంది వాహనంపై కైలాసనాధుని దర్శించుకున్నవారు మరుసటి రోజు వేకువ జామున స్వామి అమ్మవార్ల లింగోద్భవ అభిషేకాలను దర్శించుకుంటే శుభాలు జరగటమే కాకుండా భక్తుని మొరను అలకించి వరాలిచ్చే శుభ తరుణమని భక్తుల నమ్మకం. ఈ అభిషేక దర్శనానికి భక్తులే కాకుండా విఐపిలు, వివిఐపిలు కూడా విశేష సంఖ్యలో హాజరౌతారు. మహాశివరాత్రి అంటే శ్రీకాళహస్తిలో లింగోద్భవ దర్శనానికి ఎంతో విశేషం ఉంది.బ్రహ్మ,విష్ణువుల్లోని 'అహం'ను ముల్లోకాలను ఏలే ముక్కంటీశుడు రూపు మాపి దర్శనమిచ్చిన శుభ ఘడియలే లింగోద్భవ దర్శనమని ప్రతీతి.ఈ సందర్భంగా నిర్వహించే అభిషేకానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. సాధారణంగా అమ్మవారి అభిషేకం ప్రతి ఏటా జరుపుతారు.అమ్మవారి అభిషేకం అనంతరమే స్వామి అభిషేకం కాని స్వామి అభిషేకానికే ప్రాధాన్యత ఇస్తారు. దాంతో గందరగోళంగా మారుతోంది.ఈ నేపథ్యంలో అర్చకులతో చర్చించిన మీదట అమ్మవారి అభిషేకానికి కూడా ఉభయదారులతో పాటు అందరిని అనుమతిస్తారు.గతంలో అభిషేకానికి టిక్కెట్లు ఖరారు చేసి అనుమతించే వారు ఈ విధానాలతో వివాదాలు చోటు చేసుకుంటున్నందువల్ల అందరికి ఉచిత దర్శ భాగ్యం కల్పిస్తున్నారు.

## బ్యాంకు విరాళం: కోకా కోలా నీటి సరఫరా

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం నుంచి ప్రధాన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు పరుగులు తీస్తూ ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవతో దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు. అయితే ఆలయంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. ఎవరు ఏం చేస్తున్నారో? అంతుపట్టని సమస్య చోటు చేసుకుంది.ఈ నేపథ్యంలో శుక్రవారం బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.లక్షవిరాళాన్ని ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె సాగర్‌బాబులకు అందించారు.ఈ కార్యక్రమాల్లో బ్రాంచ్‌మేనేజర్ యాసిన్, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, బోర్డు సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు పాల్గొన్నారు.కాగా కోకా కోలా కంపెనీ యాజమాన్యం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చటానికి పదివేల వాటర్ కేసుల నీటిని అందించారు. ఈ మేరకు అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, దేవస్థానం ఇఓ వికెసాగర్‌బాబులకు అందించారు. కంపెనీ ప్రతినిధులు వాసు,శ్యాంబాబు, జయరాం యాదదవ్;సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.